
ఆంధ్రజ్యోతి
కర్నూలు జిల్లా వార్తలు
7
మంగళవారం 9 ఏప్రిల్ 2024

రంజాన్ వేళలు

	ఇఫ్తార్(మంగళవారం)	సెహరీ(బుధవారం)
కర్నూలు	6:37 (సాయంత్రం)	4:43 (ఉదయం)
ఎమ్మిగనూరు	6:34 (సాయంత్రం)	4:56 (ఉదయం)
ఆదోని	6:39 (సాయంత్రం)	4:42 (ఉదయం)

తరలివచ్చె తనే వసంతం

- నేడు క్రోధి నామ ఉగాది
- పంచాంగ శ్రవణాలకు సిద్ధమైన ఆలయాలు
- పండుగ కొనుగోళ్లతో మార్కెట్ సందడి



కర్నూలు (కల్చరల్), ఏప్రిల్ 8: కోయిల గొంతుతో కొత్త పాటలు పాడి.. నెమళ్ల అడుగులతో నాట్యమాడి.. మామిడి చిగుళ్ల తోరణాలు కట్టి.. శిశిర స్పర్శతో చిన్నబోయిన వనాలను చల్లగా పలకరించే వసంత రుతువు రానే వచ్చింది. షడ్రుచుల సమ్మేళనమై మన ముంగిట వాలింది. అదే అచ్చతెలుగు సంవత్సరాది. మనందరి ఉగాది... వేడుకలకు ఉమ్మడి జిల్లా ముస్తాబైంది. తెలుగు వారందరూ ఘనంగా చేసుకొనే అత్యంత ప్రీతికరమైన వేడుక 'ఉగాది'ని మంగళవారం ఉమ్మడి జిల్లా ప్రజలు ఘనంగా నిర్వహించుకోనున్నారు. ఉమ్మడి జిల్లాలో 'శ్రీ క్రోధి' నామ సంవత్సర ఉగాది వేడుకల సందడి నెలకొంది. వేడుక రోజున కొత్త దుస్తులు ధరించి, ఉగాది పచ్చడి స్వీకరించి, ఇంటిల్లిపాదీ సమీప ఆలయాల్లో నిర్వహించే పంచాంగ పఠనాన్ని వినడానికి వెళతారు. ఇది తెలుగువారి సంస్కృతిలో ప్రధానమైనది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. కొత్త సంవత్సరంలో చేపట్టబోయే కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ నూతన వస్తు, వాహనాలను కూడా కొనుగోళ్లు చేయనున్నారు. ఉభయ జిల్లాలలో ఉగాది వేడుకల సందడి వివిధ పుణ్యక్షేత్రాల్లోనూ కనిపిస్తోంది. ఉగాది పర్వదిన సందర్భంగా శ్రీశైల క్షేత్రంలో ఉగాది మహోత్సవాలు ప్రారంభం కాగా, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు శ్రీగిరికి చేరుకున్నారు. అలాగే మహానంది, అహోబిలం, యాగంటి వంటి పుణ్యక్షేత్రాల్లోనూ వేడుకల సందడి బాగా కనిపిస్తోంది. ఉగాది వేడుక సందర్భంగా నగరంలో పూజా సామగ్రి, పూల కొనుగోళ్లకు గిరాకి పెరిగింది. నగరంలోని సీ.క్యాంపు, పెద్ద మార్కెట్, కొండారెడ్డి బురుజు తదితర ప్రాంతాలన్నీ జనసందడిగా మారాయి.



కర్నూలు నగరంలో వేప, మామిడి ఆకులను కొనుగోలు చేస్తున్న మహిళలు



షడ్రుచుల పచ్చడి

అన్ని పండుగలకు పిండివంటలు చేస్తారు. ఉగాది రోజున వాటికి తోడు ఉగాది పచ్చడి చేస్తారు. కొత్త చింతపండు, లేత మామిడి ముక్కలు, బెల్లం, వేపపూత, చెరకు ముక్కలు, కారం, ఉప్పు తదితరాలు కలిపి... షడ్రుచులతో తయారయ్యే ఈ పచ్చడి ఆరోగ్య, ఆధ్యాత్మిక సందేశాన్ని ఇస్తుంది. జీవితం 'అన్ని రుచుల' సమ్మిళితమని, కష్ట సుఖాలను అనుభవిస్తూ ముందుకు సాగాలనే అర్థం ఇందులో దాగుంది. ఉగాది పచ్చడిని పరగడుపున తీసుకుంటే ఆరోగ్యానికి కూడా చాలా మంచిది.



రైతు బజారు సమీపంలో ఉగాది పూజ సామగ్రిని కొనుగోలు చేసేందుకు తరలివచ్చిన ప్రజలు



శివ పార్వతుల ప్రభోత్సవం

- నందివాహన సేవ, మహా సరస్వతిగా దర్శనమిచ్చిన భ్రమరాంబ అమ్మవారు
- మల్లన్న నామస్మరణతో తరించిన కన్నడ భక్తులు
- భక్తిప్రపత్తులతో వీరాచార్య విన్యాసాలు, అగ్నిగుండ ప్రవేశం
- నేడు పంచాంగ శ్రవణం, రథోత్సవం
- నేడు అమ్మవారికి రమావాణి సేవిత రాజరాజేశ్వరి అలంకారం

శ్రీశైలం, ఏప్రిల్ 8: శ్రీగిరి క్షేత్రంలో ఉగాది మహోత్సవాల్లో భాగంగా మూడోరోజు సోమవారం స్వామి, అమ్మవార్లకు ప్రభోత్సవం, నందివాహన సేవ నిర్వహించారు. క్షేత్ర రథవీధుల్లో అశేష భక్తజనం మధ్య స్వామి, అమ్మవార్లు వైభవంగా ఊరేగారు. పుష్ప ప్రియుడైన మల్లన్నను సుగంధ పుష్పాలు, పరిమళ ద్రవ్యాలతో అలకంరించిన ప్రభపై ఊరేగించారు. ఈ వేడుక అనంతరం రాత్రి భ్రమ రాంబ సమేత మల్లికార్జునుడు నందివాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మహా సరస్వతి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. చతుర్భుజాలలో వీణ, అక్షరమాల పుస్తకాన్ని ధరించి దర్శనం ఇచ్చారు. ముందుగా అలంకార మండపంలో ఉత్సవమూర్తులను సుగంధపుష్పాలతో ముస్తాబైన నందివాహనంపై అధిష్ఠింపజేసి అర్చకులు పూజలు జరిపారు. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ ఆలయం రాజగోపురం నుంచి వెలుపలికి తోడ్కొనివచ్చి, గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం క్షేత్ర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం ముందు కోలాటం, చెక్కభజన, జానపద పగటి వేషాల ప్రదర్శన, కేరళ కథాకళి, తప్పెట చిందు, కర్ణాటక జాంజ్, వీరగాసి, కొమ్మువాయిద్యం, శంఖానాదాలు మార్మోగాయి. గ్రామోత్సవం గంగాధర మండపం మీదుగా నంది మండపం, బయలు వీరభద్రస్వామి ఆలయం దాకా కొనసాగింది. గ్రామోత్సవంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో వీరాచార విన్యాసాలు, అగ్నిగుండ ప్రవేశం

సోమవారం రాత్రి శివదీక్షా శిబిరాల వద్ద వీరాచార సంప్రదాయాన్ని అనుసరించి భక్తులు వీరాచార విన్యాసాలు, అగ్నిగుండ ప్రవేశంలో పాల్గొన్నారు. కర్ణాటకకు చెందిన వీరశైవ భక్తులు వీరభద్ర వచనాలను పఠిస్తూ శూలాలు తమ చెంపల్లోకి, నాలుకల్లోకి, పెదవులలోకి, కడుపులోకి, చేతులకు గుచ్చుకున్నారు. తరువాత భక్తిప్రపత్తులతో నిప్పులపై నడిచారు. ఈ విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

- నేడు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం 9గంటలకు పంచాంగ శ్రవణం, సాయంత్రం 5 గంటలకు రథోత్సవం, రాత్రి అమ్మవారికి రమా వాణీ సేవిత రాజరాజేశ్వరి అలంకారం నిర్వహించనున్నారు.








చంద్రబాబును కలసిన తిక్కారెడ్డి

- మంత్రాలయం టీడీపీ అభ్యర్థిత్వంపై చర్చ
- సముచిత స్థానం కల్పిస్తానన్న అధినేత





కర్నూలు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టికెట్ దక్కని టీడీపీ అసంతృప్త నాయకులను ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు బుజ్జగిస్తున్నారు. అందులో భాగంగానే సోమవారం మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి పి. తిక్కారెడ్డితో అధినేత చంద్రబాబు భేటీ అయ్యారు. రాజకీయ, సామాజిక సమీకరణాలు కారణంగా ఆదోని, మంత్రాయలం టీడీపీ ఇన్‌చార్జిలు మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, పి. తిక్కారెడ్డిలకు టికెట్ ఇవ్వలేకపోయిన సంగతి తెలిసిందే. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పొత్తుల్లో భాగంగా ఆదోని బీజేపీకి కేటాయించడంతో ఇన్‌చార్జి కె. మీనాక్షినాయుడు, ఆయన వర్గం తీవ్ర అసంతృప్తికి గురైంది. ఇప్పటికే టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబును కె.మీనాక్షినాయుడు విజయవాడలో కలిశారు. ఏ పరిస్థితుల్లో బీజేపీకి ఆదోని టికెట్ కేటాయించాల్సి వచ్చిందో చంద్రబాబు మీనాక్షినాయుడు వివరించారు. బాబు మాటలతో సంతృప్తి చెందిన మీనాక్షినాయుడు ఎన్డీఏ అభ్యర్థి డాక్టర్ పీవై పార్థసారథి గెలుపు కోసం ప్రచారం చేస్తా అన్నారు. అదే క్రమంలో సామాజికవర్గ సమీకరణాల్లో భాగంగా మంత్రాయలం టీడీపీ టికెట్ వాల్మీకి సామాజికవర్గానికి చెందిన మాధవరం ఎన్.రాఘవేంద్రరెడ్డి ఇచ్చారు. అధిష్ఠానం నిర్ణయంతో పార్టీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి, ఆయన వర్గీయులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంత్రాలయం. కోసిగి, కౌతాళం మండలం కేంద్రాల్లో వివిధ రూపాల్లో నిరసన తెలిపారు. పునరాలోచన చేయాలని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో అధినేత చంద్రబాబు నేరుగా రంగంలోకి దిగారు. హైదరాబాదులోని తన స్వగృహంలో తిక్కారెడ్డితో సమావేశం అయ్యారు. పునరాలోచన చేయాలని తిక్కారెడ్డి అధినేత దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. సర్వేలు అన్ని కూడా అనుకూలంగా ఉన్నాయని, అయితే సామాజిక సమీకరణాల్లో భాగంగా వాల్మీక సామాజికవర్గానికి చెందిన మాధవరం ఎన్.రాఘవేంద్రరెడ్డికి టికెట్ ఇవ్వాల్సి వచ్చిందని చంద్రబాబు తెలిపారు. రాజకీయంగా మంచి భవిష్యత్తు ఇస్తాను.. రాబోయేది మన ప్రభుత్వమే.. సముచిత స్థానం కల్పించడమే కాకుండా పార్టీలో కీలక బాధ్యతలు అప్పగిస్తానని చంద్రబాబు తిక్కారెడ్డికి హామీ ఇచ్చినట్లు సమాచారం. తనకు మూడు రోజులు సమయం కావాలని.. ముఖ్య నాయకులు, సన్నిహితులతో సమావేశమై వారి అభిప్రాయం మేరకు తుది నిర్ణయం తీసుకుటానని తిక్కారెడ్డి వివరించినట్లు సమాచారం.

ముగిసిన 'పది' మూల్యాంకనం

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 8: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తయినట్లు డీఈఓ శామ్యూల్ సోమవారం వెల్లడించారు. నగరంలోని ఏ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో ఈ నెల ఒకటో తేదీ నుంచి మూల్యాంకనం ప్రారంభమైంది. కర్నూలు జిల్లాకు మొత్తం 2.02 లక్షల జవాబు పత్రాలు వచ్చాయి. సకాలంలో మూల్యాంకనం పూర్తి చేసేందుకు సహకరించిన విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి డీఈఓ తెలిపారు. ఈ నెల 20వ తేదీ తర్వాత ఫలితాలు విడుదలయ్యే అవకాశం ఉందని తెలిపారు.

నోరు అదుపులో పెట్టుకో

కర్నూలు మేయర్ రామయ్యకు టీజీ భరత్ హెచ్చరిక



మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 8: కర్నూలు మేయర్, వైసీపీ ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యపై టీజీ భరత్ ఫైర్ అయ్యారు. నోరు అదుపులో పెట్టుకోవాలని, ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్నూలు ప్రజలు దోమలు, డ్రైనేజ్, చెత్త, ఇంటి పన్నుల సమస్యలతో బాధపడుతుంటే పరిష్కరించలేని మేయర్ బీవై రామయ్య.. ఎన్నికలు వచ్చాయని ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడన్నారు. కర్నూలు నగరంలో ఎటు చూసినా సమస్యలే ఉన్నాయన్నారు. సమస్యలు తీర్చలేని వ్యక్తికి మేయర్ పదవి ఎందుకని మండిపడ్డారు. తమ కుటుంబంపై నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నాడని, ఆయన నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. లేకపోతే బీవై రామయ్య అవినీతి చిట్టా విప్పుతానన్నారు. కార్పొరేషన్ సరిగ్గా నడపలేని వ్యక్తికి ఎంపీ టికెట్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. నగరంలో ఎన్నికల ప్రచారం ప్రశాంతంగా సాగుతోందని, ఇలాంటి సమయంలో వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడటం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. దమ్ము ఉంటే మేయర్ పదవికి రాజీనామా చేసి ప్రజల్లోకి రావాలని సవాల్ విసిరారు. ప్రజా సమస్యలు తీర్చాల్సిన బాధ్యత మేయర్‌పై ఉందన్నారు. కానీ కర్నూలులో మాత్రం బీవై రామయ్య అసమర్థ మేయర్‌గా చరిత్రలో నిలిచిపోయాడన్నారు.

కల్లూరు అర్బన్‌లో వైసీపీకి షాక్

గౌరు సమక్షంలో టీడీపీలో చేరిక

కల్లూరు, ఏప్రిల్ 8: పాణ్యం నియోజకవర్గంలో వైసీపీకి షాక్ తగిలింది. కల్లూరు అర్బన్ 32 వార్డులో వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. సోమవారం ముజఫర్‌నగర్‌కు చెందిన 25 కుటుంబాలు నందికొట్కూరు పార్టీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో సోమప్పరాజు, రంగన్న, జయరాముడు, రాముడు, తిమ్మప్ప, తిరుమలేసు, రవి, మద్దమ్మ, అంజనమ్మ, పద్మావతి, సునీత, సుభద్రమ్మ, సువర్ణ ఉన్నారు. కృష్ణమనాయుడు, గిరి, గౌరుబాషా పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన పర్ల వైసీపీ నాయకులు: కల్లూరు మండలం పర్ల గ్రామానికి చెందిన వైసీపీ బూత్ కన్వీనర్ మల్లికార్జున, నాగార్జున, కోమటి హరి, మనోహర్‌తోపాటు 20 కుటుంబాలు నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సమక్షంలో సోమవారం టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో సురేష్, హరి, సిసింద్రి, రాజేష్, వేణు, చిన్నఎల్లయ్య, గణేష్, రవి, ఉప్పరి గిడ్డయ్య, మహేష్ ఉన్నారు. కార్యక్రమంలో పర్ల బీసీ సాధికార, కురువ రాష్ట్ర సభ్యుడు మహానంది పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత అన్నారు. సోమవారం 20వ వార్డు విశ్వసాయినగర్, ధనలక్ష్మీనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించి శంఖారావం, సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పెద్దటీ చుపల్లి, పల్లె రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాఘ వేంద్రారెడ్డి, బాలిరెడ్డి, పెరుగు దుర్గా ప్రసాద్‌రెడ్డి, కట్ట వెంకటరెడ్డి, మాంద్ర నరేం ద్రారెడ్డి, సీమ ప్రసాద్‌రెడ్డి, మాజీ ప్రభుత్వ న్యాయవాది నాగముని, రాయలసీమ విద్యార్థి విభాగం జేఏసీ చైర్మన్ శ్రీరాములు, అయ్యస్వామి పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వారితో గౌరు వెంకటరెడ్డి

టీడీపీతోనే అభివృద్ధి: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత తనయుడు గౌరు జనార్థన్‌రెడ్డి అన్నారు. సోమవారం 20వ వార్డు ధనలక్ష్మీనగర్‌లలో ఇంటింటికీ తిరిగి టీడీపీ మేనిఫేస్టో కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు.

జయహో బీసీ ప్రచార వాహనాలు ప్రారంభం

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 8: మండలాల వారీగా ప్రచారం కోసం జయహో బీసీ వాహనాలను టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో నాలుగు వాహనాలను ఇన్‌చార్జిలకు అప్పగించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో బీజేపీ, జనసేనతో కలిసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరుతూ ప్రచారం చేస్తామని తెలిపారు. పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడు, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు జె. తిరుపాల్ బాబు, రామక్రిష్ణ, గోవింద నాయుడు, చెన్న కేశవులు, జేమ్స్, మారెన్న, షేక్షావలి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీరు, ఉపాధి పనులపై సమీక్ష

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 8: తాగునీరు, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరా అంశాలపై సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన అధికారి జవహర్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జవహర్ రెడ్డి ముందుగా తాగునీరు, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరాపై తీసుకుంటున్న చర్యలపై జిల్లా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ జి.సృజన మాట్లాడుతూ కర్నూలు అర్బన్‌లో ఎస్ ఎస్ ట్యాంకు, గాజులదిన్నెలో సరిపడా నీరు ఉన్నాయ న్నారు. విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు ఉమాపతి, నాగేశ్వరరావు, డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

సేవా భావాన్ని అలవర్చుకోవాలి: టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 8: ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. సోమవారం నగరంలోని ఎంఎస్ ఫంక్షన్ హాల్లో యూఎస్ఏ ఎన్టీఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ షా ఫహాద్ సయ్యద్ ఆధర్యంలో ఏర్పాటు చేసిన రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమంలో టీజీ భరత్ పాల్గొని ముస్లింలకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తానా ప్రెసిడెంట్ జె. తాళ్లూరి, తానా ఫౌండేషన్ ట్రస్టీ సురేష్, శ్రీనివాస్, కార్పొరేటర్ పరమేష్, టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జహంగీర్ బాషా, మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మన్సూర్ ఆలీఖాన్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్కీటూ గోపీనాథ్ యాదవ్, జనసేన కర్నూలు ఇన్‌చార్జి హర్షద్, ఇబ్రహీం పాల్గొన్నారు.

వైసీపీకి బుద్ధి చెప్పాలి: వచ్చే ఎన్నికల్లో వైసీపీ తగిన బుద్ధి చెప్పాలని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. సోమవారం నగరంలోని శ్రీరామ్ నగర్ 23, 24 వార్డులకు చెందిన సునీల్, ప్రవీణ్, వైసీపీ వీడి టీడీపీలో చేరారు. తమ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టాలని చూస్తే ఉరుకోమని అన్నారు. ఎలాంటి కండీషన్లు లేకుండా సునీల్, ప్రవీణ్ తన దగ్గర చేరారని అన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, సీనియర్ నాయకులు బషీర్, స్వామిరెడ్డి, అబ్బాస్, జనసేన నాయకుడు పవన్ పాల్గొన్నారు.


రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేస్తున్న టీజీ భరత్

మసీదులో టీజీ భరత్ ప్రార్థనలు: నగరంలోని మౌర్యఇన్ ఎదురుగా ఉన్న రిసాల్దార్ మసీదులో ముస్లింలతో కలిసి టీజీ భరత్ ప్రార్థనలు చేశారు. ముస్లింలకు పండ్లు తినిపించి ఉపవాస దీక్షలను విరమింపజేశారు. టీజీ భరత్ మాట్లాడుతూ రంజాన్ నెల ముస్లింలకు ఎంతో పవిత్రమైందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాహిద్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శులు జహంగీర్ బాషా, బషీర్, మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనై జింగ్ సెక్రటరీ మన్సూర్ ఆలీఖాన్, మాజీ కార్పొరేటర్, తెలుగు యువత పార్లమెంట్ ఆధ్యక్షుడు అబ్బాస్ పాల్గొన్నారు.

ముందస్తు ఉగాది, రంజాన్ వేడుకలు

కర్నూలు (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 8: సంతోష్‌నగర్‌లోని సంసిద్ పాఠశాలలో సోమవారం ముందస్తు ఉగాది, రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భిన్నత్వంలో ఏకత్వానికి మారు పేరుగా హిందూ ముస్లింలు వేడుకలు నిర్వహించుకుంటున్నారని ప్రధానోపాధ్యాయుడు మహబూబ్ ఆలీఖాన్ తెలిపారు. విద్యార్థులకు చదువుతోపాటు దేశ సంస్కృతి, సంప్ర దాయాల పట్ల అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులు వివిధ వేషధారణల్లో అలరించారు. ప్రధానోపాధ్యాయురాలు కీర్తి సింధియా, క్యాంపస్ మేనేజర్ సుమిత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వివిధ వేషధారణల్లో విద్యార్థులు

విభిన్న ప్రతిభావంతుల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 8: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విభిన్న ప్రతిభావంతులు, 85 ఏళ్లు పైబడిన వారికి కల్పించాల్సిన ఓటు హక్కుపై సంబంధిత అధికారులు, విభిన్న ప్రతిభావంతుల సంఘాల ప్రతినిధులతో సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో కలెక్టర్ జి.సృజన సమావేశం నిర్వహించారు. డీఆర్వో మధుసూదన్‌రావు, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయకురాలు రెయిస్ ఫాతిమా, ప్రణాళిక శాఖ సహాయ సంచాలకురాలు భారతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగప్రసన్నలక్ష్మి, డీఎంహెచ్‌వో ప్రవీణ్ కుమార్, ఎస్ఎస్ఏ పీవో విజయ జ్యోతి, డ్వామా, మెప్మా, డీఆర్‌డీఏ పీడీలు అమర్నాథ్ రెడ్డి, నాగశివలీల, సలీంబాషా పాల్గొన్నారు.

సర్జరీ ఆరోగ్య కేసులు పెంచండి

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 8: జనరల్ సర్జరీ విభాగంలో ఆరోగ్యశ్రీ కేసులు పెంచాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డి ఆదేశించారు. సోమవారం ఆసుపత్రిలో సర్జరీ విభాగపు వైద్యు లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రొఫెసర్లు రామక్రిష్ణా నాయక్, కోటిరెడ్డి, మురళీకృష్ణ, మాధవీ శ్యామల పాల్గొన్నారు. ఆసుపత్రికి పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ రూ.26 లక్షలు విలువైన మూడు అనస్థీషియా వర్క్ స్టేషన్ పరికరాలను పవర్ గ్రిడ్ ప్రతి నిధులు సూపరింటెండెం ట్‌కు అందజేశారు.

వైసీపీ అరాచక పాలనను అంతం చేయండి


స్టాంటన్‌పురంలో ప్రచారం చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి, బొగ్గుల దస్తగిరి

కర్నూలు(రూరల్), ఏప్రిల్ 8: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను కలిసికట్టుగా అంతమొందించాలని టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. కర్నూలు అర్బన్ మండలం స్టాంటన్‌పురం 39వ వార్డులో టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరితోపాటు బీజేపీ, జనసేన నాయకులతో కలిసి విష్ణువర్ధన్‌రెడ్డి సోమవారం ప్రచారం చేశారు. అంతక ముందు అంబేడ్కర్ నగర్‌లో టీడీపీ కార్యాలయాన్ని విష్ణు ప్రారంభించారు. టీడీపీ సీనియర్ నాయకుడు రాచపూడి సీమోన్, జనసేన నాయకులు రాంబాబు, బీజేపీ నాయకురాలు గీతామాధురిరెడ్డి, టీడీపీ నాయకులు జెశ్రీయాదవ్, కురువ మధు, దేవరాజు, యర్మియా, ప్రకాశం, మార్టిన్, బీరు ప్రతాప్‌రెడ్డి, తోట రాముడు, జనార్దన్, చిన్న గిడ్డయ్య, నాగన్న, దావుద్, విజయ్, దేవదాస్ పాల్గొన్నారు.

టీడీపీకి పూర్వ వైభవం: దస్తగిరి

గూడూరు, ఏప్రిల్ 8: కోడుమూరు కోటపై టీడీపీ జెండా ఎగురవేసి పార్టీకి పూర్వ వైభవం తెద్దామని పార్టీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. సోమవారం గూడూరులో నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు ఆధ్వర్యంలో దస్తగిరి ఇంటింటి ప్రచారం చేశారు. మల్లాపు బుడ్డంగలి, షాషావలి, జె సురేష్, వెంకటేష్, పౌలు పాల్గొన్నారు.

వల్లెలాంబదేవి ప్రభోత్సవం



కోడుమూరు, ఏప్రిల్ 8: ఉగాది పండుగ పురస్కరించుకొని సోమవారం రాత్రి వల్లెలాంబదేవి ప్రభోత్సవం నిర్వహించారు. ఉదయం అమ్మవారి ఆలయంలో గోపూజ, గణపతి పూజ, గంగాపూజ, పల్లకి సేవ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ రఘునాథ్‌రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

PUBLIC NOTICE

UNDER the instructions of my client M/s.Shriram Finance Limited, Chennai, Branch at Kurnool, I issue the following notice to general public. My clients intends to grant loan to **Sri. Moccharla Praveen Kumar, S/o. Sri. M.Devaraju, H.No: 81/ 5B-1-6(1), Raghavendra Nagar, B.Camp, Kallur, Kurnool.** by keeping the below mentioned of property of him as security by way of Registered martgage. as such if anyone have any claims, charges, Mortgages, Sale agreements, court attachments, court disputes etc, shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

The property is open residential house plots bearing No.14B, 15B, 16B, 17B and 18B in Sy.No.244B of Sakunala Village, Orvakal Mdl, Kurnool and bounded as follows. **East :** 30'feet road, **West :** Plot Nos.11B, 10B, 9B, 8B, 7B, **North :** Plot No.13B, **South :** 30'feet road, **Extent : 500** Sq.Yards

BYREDDY VENKATA RAMANA REDDY
ADVOCATE, KURNOOL, CELL:94400 79646

ఏటీఎంలో చోరీ యత్నం

ఓర్వకల్లు, ఏప్రిల్ 8: మండలంలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై హుశేనాపురం బస్‌స్టేషన్ సమీపాన ఉన్న ఇండియా-1 ఏటీఎంలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చోరీ యత్నం చేశారు. ఏటీఎం మెయిన్ డోర్‌ను గ్యాస్ కట్టర్లతో తీసేందుకు ప్రయత్నించారు. అయితే అది రాలేదు. ఈ విషయం తెలిసి ఎస్ఐ రాజారెడ్డి వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుల వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రేపు ఎన్‌డీఏ కూటమి సమన్వయ కమిటీ సమావేశం

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 8: ఎన్‌డీఏ పక్షాలైన టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి సమావేశం ఈనెల 10న నిర్వహిస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు తెలిపారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశంలో కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గం, 7 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు, టీడీపీ, జనసేన, బీజేపీ పార్లమెంట్ స్థానాల అధ్యక్షులు, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పాల్గొంటారని తెలిపారు.

ఐరన్ ఓర్ అక్రమ నిల్వలు సీజ్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 8: ఐరన్ ఓర్ అక్రమ నిల్వలు సీజ్ చేసినట్లు గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. సోమవారం వెల్దుర్తి మండలం బాలాపురం-రేపల్లె దారిలో మధ్య అటవీ భూముల్లో అక్రమ ఐరన్ ఓర్ తవ్వకాలు జరుగుతున్నట్లు గుర్తించామని అన్నారు. పోలీసు, రెవిన్యూ, మైనింగ్ విజిలెన్స్ సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి సర్వే నెంబర్ 501,448లో ఐరన్ ఓర్ నిల్వలు ఉన్నట్లు గుర్తించామన్నారు ఈ తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్, పోలీసు సిబ్బంది, గ్రామ రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉగాది బ్రహోత్సవాలు



నందవరం చౌడేశ్వరిదేవి

బనగానపల్లె, ఏప్రిల్8: జిల్లాలో ప్రముఖ శక్తి క్షేత్రమైన నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో మంగళవారం నుంచి ఉగాది బ్రహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జి. కామేశ్వరమ్మ సోమవారం తెలిపారు. మంగళవారం గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచాంగ శ్రవణం, సాయంత్రం రథోత్సవం, రాత్రి పౌరాణిక నాటక ప్రదర్శన ఉంటాయని తెలిపారు. 10వ తేదీ రాత్రి 9 గంటలకు కళ్యాణోత్సవం, అనంతరం గ్రామోత్సవం, 11వ తేదీ అమ్మవారి రాయబార మహోత్సవం, 12 తేదీ సహస్రనామ కుంకుమార్చన, రాత్రి దివ్విచుక్క పెట్టడం, ఆ తకాంవత జ్యోతి మహోత్సవం నిర్వహిస్తామన్నారు. 13వ తేదీ, 14వ తేదీ సాయంత్రాలు రథోత్సవాలు, 15వ తేదీ వసంతోత్సవం ఉంటాయని తెలిపారు.

14 నుంచి వైఎస్ షర్మిల పర్యటన

డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీ నరసింహయాదవ్



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహయాదవ్

నంద్యాల టౌన్, ఏప్రిల్ 8: నంద్యాల జిల్లాలో ఈనెల 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల 'ఏపీ న్యాయయాత్ర' పేరుతో కాంగ్రెస్ ఎన్నికల శంఖారావానికి శ్రీకారం చుట్టనున్నారు. సార్వత్రిక ఎన్నికలకు కాంగ్రెస్ సన్నద్ధమవుతున్న నేపథ్యంలో వైఎస్ షర్మిల యాత్ర ప్రాధాన్యతను సంతరించుకుంది. వైఎస్ షర్మిల ఏపీ న్యాయ యాత్ర వివరాలను డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీ నరసింహయాదవ్ సోమవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో వెల్లడించారు. ఈనెల 14వ తేదీన ఆళ్ళగడ్డ నియోజకవర్గం నుంచి వైఎస్ షర్మిల యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. నాలుగు రోజుల పాటు వైఎస్ షర్మిల జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో పర్యటించడం జరుగుతుందని, 17వ తేదీన డోన్ నియోజకవర్గంలో యాత్ర ముగుస్తుందని తెలిపారు. కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ఏపీ రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 9 గ్యారెంటీ పథకాలైన మహిళా మహాలక్ష్మి, రైతు నేస్తం, యువ వికాసం, రైతు న్యాయం, ఉచిత విద్య, ప్రత్యేక హోదా, ఉపాధి హామీ, ఇందిరమ్మ ఇళ్లు, కాంగ్రెస్ చేయూత పథకాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపవరం గోకుల కృష్ణారెడ్డి, చింతల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద లావాదేవీలపై నిఘా: కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 8: రూ.లక్షకు పైగా జరిగిన లావాదేవీలు, అనుమానాస్పద ఖాతాల రోజువారి వివరాలను పంపాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన బ్యాంకర్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సాధారణ ఎన్నికలు-2024కు సంబంధించిన వ్యయ పర్యవేక్షణపై బ్యాంకర్లతో పాటు సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్, ఆర్‌బీఐ నుంచి జారీ చేయబడిన మార్గదర్శకాల ప్రకారం లావాదేవీల వివరాలను 9 బ్యాంకులు మాత్రమే ప్రతిరోజు నివేదికలు ఇస్తున్నాయన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంకు, యూనియన్ బ్యాంకు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులకు పలుమార్లు చెప్పినప్పటికీ కూడా ఇంత వరకు నివేదికలు కూడా పంపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకుల నుంచి నివేదికలు రాకపోతే సంబంధిత బ్యాంకులకు నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. బ్యాంకుల కంట్రోలింగ్ ఆఫీసర్స్ ఖచ్చితంగా హాజరు కావాలన్నారు. ఎంసీసీ ఉల్లంఘనలు జరిగినా బ్యాంకు అధికారులే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో ఎల్డీఎం రామచంద్రరావు, డీసీవో రామాంజనేయులు, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, మెప్మా పీడీ శివనాగలీల, ఇన్‌కం ట్యాక్స్ నోడల్ అధికారి పాండురంగ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య

ఇంటి టెర్రస్‌పై నిద్రిస్తుండగా కత్తితో గొంతు కోసిన దుండగులు

నంద్యాల నూనెపల్లి, ఏప్రిల్ 8: నంద్యాల త్రీటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని వెంకటాచలం కాలనీలో ఆదివారం అర్ధరాత్రి యువకుడు దారుణహత్య కలకలం రేపుతోంది. రెండో అంతస్తు ఇంటి టెర్రస్‌పై నిద్రపోతున్న షేక్ సమీర్(22)ను గుర్తు తెలియని దుండగులు ఇంటిపైకి చేరుకుని కత్తితో గొంతుకోసి దారుణంగా హతమార్చారు. వెంకటాచలం కాలనీలోని వలీ, గౌసియా దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. మొదటి కుమారుడైన షేక్ సమీర్ పగలు డోర్ పాలీష్ పని చేసుకుని, సాయంత్రం దేవనగర్ మసీద్ సెంటర్‌లో చికెన్ పకోడా వ్యాపారం చేస్తాడు. ఆదివారం రాత్రి వ్యాపారాన్ని ముగించుకుని ఇంటికి వచ్చి భోజనం చేసి ఇంటి టెర్రస్‌పైకి పడుకునేందుకు వెళ్లాడు. సోమవారం తెల్లవారుజామున 3గంటలకు రంజాన్ ఒక్కపొద్దు కోసం కుటుంబ సభ్యులు సమీర్‌ను నిద్రలేపేందుకు టెర్రస్ పైకి వెళ్లాడు. చీకట్లో ఎంత పలికినా లేవకపోవడంతో అనుమానం వచ్చి లైట్లు వేసి చూసే సరికి రక్తపు మడుగులో విగత జీవిగా పడి ఉండటాన్ని చూశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు. త్రీటౌన్ సీఐ నరసింహులు, సీసీఎస్ సీఐ మంజునాథరెడ్డి, సిబ్బంది స్థానికుల నుంచి ప్రాథమిక సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. డాగ్ స్క్వాడ్ బృందం చేరుకుని పరిశీలించింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరసింహులు తెలిపారు.

వైసీపీలో విభేదాలు

- చిచ్చు రేపిన నగర అధ్యక్ష పదవి
- ఏకపక్షంగా పేరు ప్రకటించంపై కార్పొరేటర్ల ఆగ్రహం

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 8: కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం వైసీపీలో మరోసారి విభేదాలు భగ్గుమన్నాయి. కార్పొరేటర్ సత్యనారాయణమ్మకు జిల్లా అధ్యక్షురాలిగా అధిష్టానం ప్రకటించడతో అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరాయి. పార్టీ కోసం పని చేసిన వారిని కాదని మధ్యలో వచ్చిన వారికి పదవి ఎలా కట్టబెడతారని కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఎస్వీ మోహన్‌రెడ్డి వర్గీయులు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్‌ను ఆయన నివాసంలో కలిసి తమ నాయకుడికి ఎలాంటి పదవి ఇవ్వకుంటే ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంటామని తేల్చిచెప్పారు. కాగా సోమవారం ఎస్వీ కాంప్లెక్స్‌లో జరిగిన సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు, ఎస్వీ మోహన్‌రెడ్డి కలిసి తమ మధ్య విభేదాలు లేవని చెప్పుకొచ్చారు. కర్నూలు నియోజకవర్గ పరిధిలోనే ఇద్దరు బీసీ కార్పొరేటర్లు ఉన్నారు. అందులో 5వ వార్డు, 43వ వార్డుకు చెందిన కార్పొరేటర్లు బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు. కురువ సామజిక వర్గానికి చెందిన సత్యనారాయణమ్మను మేయర్‌గా ప్రకటించారు. దీనిపట్ల చాలా మంది కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా నియోజకవర్గ పార్టీ అధ్యక్ష పదవిని కూడా ఆమెకే ఎలా ఇస్తారని అంటున్నారు. అన్ని పదవులు ఆమెకే కట్టబెడితే మిగిలిన ఇద్దరు బీసీలు ఏం చేయాలని ప్రశ్నిస్తున్నారు. ఇద్దరు బీసీలలో ఒకరు ఎమ్మెల్యే వర్గానికి చెందిన కార్పొరేటర్ కాగా మరొకరు మాజీ ఎమ్మెల్యేకి చెందిన కార్పొరేటర్.

● అధ్యక్షురాలు లేకుండానే పోస్టరు విడుదల.. కర్నూలు అసెంబ్లీ పరిధిలో తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని చెబుతూ ఎస్వీ మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సమావేశానికి, ఎంపీ అభ్యర్థి బీవై. రామయ్య నిర్వహించిన పోస్టర్ విడుదల కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ హాజరు కాలేదు. ఆమెతో పాటు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌కు సంబంధించిన కార్పొరేటర్లు, నాయకులు కూడ రాలేదు. కర్నూలు నియోజకవర్గానికి చెందిన ఓ నేత అధినాయకత్వం వద్ద సత్యనారాయణమ్మకు జిల్లా అధ్యక్షపదవి కోసం చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. తనకు సీటు ఇవ్వకపోయినా తాను చెప్పిన వారికి అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే సత్యనారాయణమ్మను అధ్యక్షురాలిగా ప్రకటించినట్లు తెలిసింది. ఇది పార్టీలో తీవ్రమైన విభేదాలకు దారి తీసింది.



ఇటీవల ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్‌తో చర్చిస్తున్న ఎస్వీ వర్గీయులు

రైలు కింద పడి ప్రేమ జంట ఆత్మహత్య

- మంత్రాలయంలో ఘటన



చాకలి వెంకటేశ్ ఫైల్)



మేకల నందిని ఫైల్)

మంత్రాలయం, ఏప్రిల్ 8: క్షణికావేశం ఇరు కుటుంబాల్లో పెనువిషాదాన్ని నింపింది. ప్రేమించుకోవడంలో నెగ్గిన వారు ఆ ప్రేమను నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారు. భవిష్యత్తును ఆలోచించకుండా నిండుజీవితానికి స్వస్తి పలికి ఆత్మహత్య చేసుకున్నారు. కులాలు వేరు కావడంతో పెళ్లికి పెద్దలు ఒప్పుకోరని భయపడ్డ ఓ ప్రేమజంట ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మంత్రాలయం రైల్వేస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే ఎస్ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుల్ సాయిసర్వేశ్వర్‌రావు, మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా... మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన చాకలి చిన్నగోవిందు, లక్ష్మి దంపతుల కుమారుడు వెంకటేశ్ (22), మంత్రాలయం రామచంద్రనగర్‌కు చెందిన మేకల ఆంజనేయులు, జయమ్మల కూతురు నందిని (21) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. వీరిద్దరు మండలంలోని రచ్చుమర్రి మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ చదివే సమయంలోనే ఒకరినొకరు ప్రేమించుకున్నారు. మేజర్లు అయిన తర్వాత వివాహం చేసుకుందామని నిశ్చయించుకున్నారు. ఈ ప్రేమ వ్యవహారం ఇరువురి తల్లిదండ్రులకు తెలియడంతో వారిద్దరినీ దూరంగా ఉంచారు. వెంకటేశ్ రచ్చుమర్రి గ్రామంలోనే ఉంటూ పొలం పనులు చేస్తుండేవాడు. నందిని కర్నూలు పుల్లయ్య ఇంజనీరింగ్ కాలేజీలో మొదటి సంవత్సరం బీటెక్ చదువుతోంది. ఉగాది పండుగ కావడంతో రెండు రోజుల క్రితం కుమార్తె నందిని తండ్రి ఆంజనేయులు మంత్రాలయానికి తీసుకువచ్చాడు. విషయం తెలుసుకున్న వెంకటేశ్ ఎలాగైనా ఆమెను పెళ్లి చేసుకుందామని మంత్రాలయానికి వెళ్లి తన బైక్‌పై నందితతో కలిసి తుంగభద్ర రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. కులాలు వేరు కావడంతో తమ తల్లిదండ్రులు వివాహాన్ని అంగీకరించరని, దానికన్నా ప్రాణాలు తీసుకుందామని భావించారు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత రైలుపట్టాలపై ఇద్దరు నిల్చుండగా.. బాగల్‌కోట నుంచి మైసూరు వెళ్లే ట్రైన్ నెంబర్.17308 ఢీకొట్టింది. దీంతో వారి మృతదేహాలు చెల్లాచెదురయ్యాయి. విషయం తెలుసుకున్న రైల్వే ఎస్ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుల్ సాయిసర్వేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ లభించిన ఆధారాల ద్వారా ఇరు కుటుంబాలకు సమాచారం ఇచ్చి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపాల్ తెలిపారు.

కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేద్దాం

- జగన్‌రెడ్డిని ఇంటికి పంపే సమయం ఆసన్నమైంది
- గౌరు నివాసంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల సమన్వయ సమావేశం

కల్లూరు, ఏప్రిల్ 8: టీడీపీ కూటమి అభ్యర్థులు అత్యధిక మెజారిటీతో గెలవడానికి సమన్వయంతో కృషి చేద్దామని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు అన్నారు. సోమవారం గౌరు స్వగృహంలో చేపట్టిన టీడీపీ కూటమి సర్వసభ్య సమావేశానికి మూడు పార్టీల నుండి గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి, చింతాసురేష్, నాగరాజు, కె.చెన్నయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ ఈ ఎన్నికలు అత్యంత కీలకమైనవని, పాణ్యం నియోజకవర్గంలో అన్ని పార్టీల సహకారంతో ముందుకు వెళతామన్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొని వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టి ప్రజల మద్దతు కోరతామన్నారు. ఇప్పటికే వైసీపీ తీరువల్ల సాధారణ ప్రజలు ఉద్యోగులు, రైతులు, మహిళలు, నిరుద్యోగులు అవస్థలు పడుతున్నారని అన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రం బాగుంటుందని, చంద్రబాబు సీఎం అయితేనే పరిశ్రమలు, పెట్టుబడులు, యువతకు ఉపాధి సాధ్యమవుతాయని అన్నారు. ఈకార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పీయూ. మాదన్న, ఎస్వీ. రామకృష్ణ, జనసేన నాయకులు సుధాకర్, షబ్బీర్, సలాం, ప్రవీణ్, బీజేపీ నాయకులు సోమేశ్వరాచారి, గంగాధర్ రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వీరప్ప, తారకేశ్వరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, మీసాల గంగాధర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌరుచరిత

నల్లమల ఘాట్ రోడ్డులో ఆంక్షలు

- దోర్నాల వైపు వెళ్లే గూడ్స్ వాహనాల దారి మళ్లింపు
- పలుచోట్ల పోలీసు చెక్‌పోస్టుల ఏర్పాటు

ఆత్మకూరు, ఏప్రిల్ 8: శ్రీశైలంలో జరుగుతున్న ఉపాధి ఉత్సవాలను పురస్కరించుకుని నల్లమల ఘాట్ రోడ్డులో పోలీసుశాఖ అధికారులు పలు ఆంక్షలు విధించారు. గతంలో ఉగాది ఉత్సవాల సమయంలో చోటుచేసుకున్న ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని నల్లమల అటవీ ప్రాంతంలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి మీదుగా వెళ్లే గూడ్స్ వాహనాలపై నిబంధనలు అమలు చేశారు. ఆత్మకూరు మీదుగా దోర్నాల వైపు వెళ్లే గూడ్స్ వాహనాలు, భారీ వాహనాలను నంద్యాల టర్నింగ్, వెలుగోడు మీదుగా నంద్యాల, గిద్దలూరుల నుంచి దారి మళ్లించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 9 నెంచి 11వ తేది వరకు ఈ నిబంధనలను ఇలాగే కొనసాగించనున్నట్లు ఆత్మకూరు అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. వాస్తవానికి శ్రీశైలంలో జరుగుతున్న ఉగాది ఉత్సవాల సందర్భంగా కర్నాటక రాష్ట్రం నుంచి లక్షలాది సంఖ్యలో పాదయాత్రగా తరలివచ్చారు. అదే విధంగా వివిధ వాహనాల్లో కూడా భారీగా క్షేత్రానికి చేరుకున్నారు. ఉత్సవాల్లో స్వామి అమ్మవార్ల దర్శనం అనంతరం వారు తిరుగు ప్రయాణం కానున్నారు. ఈ నేపథ్యంలో నల్లమల ఘాట్‌రోడ్డులో వాహనాల రద్దీ అధికమై ట్రాఫిక్ జామ్ సమస్య వాటిల్లితే మరింత ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. వీటన్నింటిని దృష్టిలో వుంచుకుని పోలీసుశాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలతో ఘాట్‌రోడ్డులో ఆంక్షలు విధించినట్లు తెలిసింది. ఇదిలా వుంటే కర్నూలు నుంచి దోర్నాల వైపు వచ్చే వాహనాలను అక్కడ నంద్యాల చెక్‌పోస్టు వద్దే మళ్లించేలా చర్యలు చేపట్టనున్నారు. అదే విధంగా ఒకవేళ ఆత్మకూరు నుంచి వెళ్లే ప్రయత్నం జరిగితే వాటిని నంద్యాల టర్నింగ్ నుంచి నంద్యాలకు మళ్లించాలని సూచిస్తున్నారు. కేవలం శ్రీశైలానికి అత్యవసర సరుకులను చేరవేసే గూడ్స్ వాహనాలకు మాత్రమే అనుమతించనున్నట్లు వారు చెప్పారు.

ఇద్దరు దొంగల అరెస్టు

నంద్యాల(నూనెపల్లె), ఏప్రిల్ 8 : నంద్యాల మండలం రైతు నగర్‌లోని భగత్‌సింగ్ కాలనీలో గత నెలలో జరిగిన చోరీ కేసులో ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రవీంద్రనాథరెడ్డి తెలిపారు. సోమవారం తాలూకా పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాదుకు చెందిన సుధాకర్, తిరుపతికి చెందిన గణేష్‌లను మండలంలోని పోలూరు క్రాస్ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. వారు రైతు నగర్‌లో జరిగిన చోరీ ఘటనను ఒప్పుకున్నారన్నారు. వారి నుంచి 17 తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు.

● **నంద్యాలలో భారీ చోరీ :** నంద్యాలలోని 2వపట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని టెక్కెలో ఉన్న తేజ అపార్ట్‌మెంట్‌లో ఇరిగేషన్ ఏఈ సుధీర్ ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఉగాది పండగ సందర్భంగా ఇంటికి తాళం వేసి పండుగ సరుకులు తేవడానికి సూపర్ మార్కెట్‌కు వెళ్లాడు. ఇంటికి వచ్చి చూడగా.. తాళం తీసి కనిపించింది. ఇంట్లోని బీరువాలో ఉన్న 40 తులాల బంగారు నగలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు.

ఉగాది బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

శ్రీశైలం, ఏప్రిల్ 8: శ్రీశైలం క్షేత్రంలో జరుగుతున్న ఉగాది మహోత్సవాలకు 740 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందులో 9 మంది డీఎస్పీలు, 30 మంది సీఐలు, 62 మంది ఎస్ఐలతో పాటు ఇతర సిబ్బందిని ఉత్సవాల భద్రతలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఎస్పీ రఘువీర్‌రెడ్డి క్షేత్రపరిధిలోని రథవీధిని, అగ్నిగుండ ప్రవేశ ప్రాంగణం, పార్కింగ్ తదితర ప్రదేశాలలో పర్యటించి భద్రత, ట్రాఫిక్ నిర్వహణపై పోలీస్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఎస్పీ వెంట ఏఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్, ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలింపు

ఓర్వకల్లు, ఏప్రిల్ 8: ఓర్వకల్లులో రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం మధ్యాహ్నం ఓర్వకల్లులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడి కళ్లెదుటే మధ్యాహ్న భోజన పథకానికి అందించే బియ్యాన్ని ఆటోలో తరలించుకపోయినట్లు తెలుస్తోంది. ఓర్వకల్లు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని స్టాక్ రూము నుంచి మధ్యాహ్న భోజన పథకం బియ్యాన్ని అక్రమంగా తరలించాడు. ఇది చూస్తూ కూడా ప్రధానోపాధ్యాయుడు పట్టించుకోకపోవడం దారుణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు విచారణ జరపాలని వారు కోరుతున్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

టీడీపీ కూటమి గెలుపును ఆపలేరు

● అధికారంలో వచ్చిన వెంటనే వేదవతి ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పూర్తిచేస్తాం
● విలేకరుల సమావేశంలో టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, ఆలూరు అభ్యర్థి వీరభద్రగౌడ్

ఆలూరు, ఏప్రిల్ 8: జనసేన, బీజేపీ, టీడీపీ కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరని టీడీపీ కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్ అన్నారు. సోమవారం ఆలూరు టీడీపీ కార్యాలయంలో బీజేపీ, జనసేన, టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారని విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆలూరు ప్రాంతంలో వేదవతి ప్రాజెక్ట్ మంజూరు అయ్యిందని, తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నామమాత్రంగా పనులు చేసి, నిధులు లేక పనులు ఆపేశారని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చుతామని స్పష్టం చేశారు. అభివృద్ధి చేసే టీడీపీకే ప్రజలు పట్టం కట్టాలని కోరారు. అనంతరం వీరభద్రగౌడ్, పంచలింగాల నాగరాజును టీడీపీ పట్టణ కమిటీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రవీంద్రస్వామి, బసవరాజు, జనసేన పార్టీ నాయకులు చత్రపతి, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ కురువ జయరాం, టీడీపీ మండల కన్వీనర్ అశోక్, నాయకులు గిరిమల్లేష్ గౌడ్, రఘుబాబు, నరసప్ప, పాల్గొన్నారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బస్తిపాటి నాగరాజు, వీరభద్రగౌడ్, దేవరగట్టు మాళమల్లేశ్వర స్వామి దర్శనానికి వెళ్తున్న అభ్యర్థులు

దేవరగట్టులో పూజలు

హొళగుంద : మండల పరిధిలోని దేవరగట్టు మాళమల్లేశ్వర స్వామి ఆలయాన్ని టీడీపీ కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్ దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వీరి వెంట టీడీపీ మండల కన్వీనర్ తిప్పయ్య, టీడీపీ యువనాయకుడు గిరి మల్లేష్‌గౌడ్, బీజే పొంపాపతి, మైనారిటీ నాయకుడు ఎండీ ఆదాం, తోక వెంకటేష్, కాకి సీతయ్య, ఎండీ హళ్లి సర్పంచ్ జీకే సుధాకర్, వందవాగిలి శేషప్ప పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి

ఆస్పరి/మద్దికెర : ఆస్పరి, అటెకల్ గ్రామాల్లో టీడీపీ ఎంపీ అభ్యర్థి నాగరాజు పర్యటించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాక్షస పాలన అంతానికి ఇక 40 రోజులు మాత్రమే గడువు ఉందని అన్నారు. కూటమి లక్ష్యం పై విస్తృతంగా కార్యకర్తలకు అవగాహన కల్పించాలని సూచించారు. మాజీ ఎంపీపీ కృష్ణయాదవ్, మాజీ మండల కన్వీనర్‌లు ఎస్ తిమ్మన్న, వెంకటేష్, గోవింద పాల్గొన్నారు.

అలాగే మద్దికెరలో టీడీపీ ఎంపీ అభ్యర్థి నాగరాజును నంద్యాల తెలుగు యువత ఉపాధ్యక్షుడు మూలింటి రామూ యాదవ్, జిల్లా బీసీ సాధికారత యాదవ సంఘం అధ్యక్షుడు మూలింటి రంగస్వామి కలిశారు. మేనిఫెస్టోను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీరాములు, బాషా, రంగస్వామి, తదితరులు ఉన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి : ఆర్వో

ఆలూరు, ఏప్రిల్ 8: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలని రిటర్నింగ్ అధికారి రామునాయక్, సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల ప్రచార షెడ్యూల్, సమావేశాలు, కార్యాలయాల ప్రారంభోత్సవాలు, మైక్ ఏర్పాటు వంటి వాటి పై ఎన్నికల అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. సమావేశంలో టీడీపీ, వైసీపీ అభ్యర్థులు వీరభద్ర గౌడ్, విరుపాక్షి, బీఎస్పీ అభ్యర్థి రామలింగ, ఎన్నికల సహాయ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆస్తిపన్ను చెల్లింపు పై ఐదు శాతం డిస్కౌంట్

ఆదోని టౌన్, ఏప్రిల్ 8: పట్టణ పరిధిలోని ఆస్తిపన్నుల చెల్లింపుదారులకు ప్రభుత్వం డిస్కౌంట్ ప్రకటించిందని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి సోమవారం తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నును ఈ నెల 30వ తేదీలోగా ఏకకాలంలో మొత్తం ఆస్తి పన్ను చెల్లించిన వారికి ప్రభుత్వం ఐదు శాతం డిస్కౌంట్‌ను పొందే అవకాశం కల్పించిందని పేర్కొన్నారు.

ముస్లిం కాలనీలో అన్నీ సమస్యలే

ఆదోని టౌన్, ఏప్రిల్ 8: పట్టణంలోని మదీనా మసీద్ కాలనీలో సమస్యలు తిష్టవేశాయని కాంగ్రెస్ పార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎంఎండీ నూర్ అహ్మద్ అన్నారు. సోమవారం ఆయన కాలనీ పరిసరాలను పరిశీలించి స్థానికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వారం రోజులకు ఒకసారి మాత్రమే తాగునీటి సరఫరా జరుగుతోందని, అది కూడా తెల్లవారుజామున మూడున్నర గంటల నుంచి ఒక గంట సేపు మాత్రమే నీటిని వదులుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. పట్టణ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు, కాలనీ ఇన్‌చార్జి హుసేన్ బాషా పాల్గొన్నారు.

200 మంది వలంటీర్లు రాజీనామాకు సిద్ధం

● మొబైల్, బయోమెట్రిక్స్ అందజేయాలని ఎంపీడీవో ఆదేశం

ఆస్పరి, ఏప్రిల్ 8: మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న 200 మంది వాలంటీర్లు రాజీనామాకు సిద్ధమయ్యారు. సోమవారం వివిధ గ్రామాలకు చెందిన వలంటీర్లు ఆస్పరి ఎంపీడీవో కార్యాలయంలో రాజీనామా పత్రాలను అందజేశారు. వారి వద్దనున్న మొబైల్ ఫోన్స్, సిమ్ కార్డు, బయోమెట్రిక్ డివైజ్‌లను సంబంధిత గ్రామ కార్యదర్శికి అందజేసి, నోడ్యూ సర్టిఫికెట్ తీసుకొని, రాజీనామా పత్రానికి జతచేసి ఇస్తేనే, వాటిని జిల్లా అధికారులకు పంపుతామని ఎంపీడీవో లక్ష్మీనారాయణ తెలిపారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

మంత్రాలయం, ఏప్రిల్ 8: మాధవరం తండాలో నాటుసారా స్థావరాలపై మాధవరం ఎస్ఐ క్రిష్ణమూర్తి సిబ్బందితో వెళ్లి 2,500 లీటర్ల బెల్లం ఊట, నాటుసారాను ధ్వంసం చేశారు. 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

768 అక్రమ కర్ణాటక మద్యం స్వాధీనం: నారాయణపురం గ్రామ సమీపంలో కర్ణాటక నుంచి 8 బాక్సుల్లో 768 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు మోటారు సైకిల్ పై తెస్తుండగా ఎమ్మిగనూరు సెబ్ సీఐ భార్గవ్‌రెడ్డి తన సిబ్బందితో దాడులు చేసి పట్టుకున్నారు. సోమవారం కర్ణాటకలోని కటకనూరు గ్రామానికి చెందిన నరసింహను అరెస్టు చేసి 8 బాక్సులను మోటారు సైకిల్ సీజ్ చేసినట్లు తెలిపారు.

12 కేసుల్లో పట్టుబడిన మద్యం బాటిళ్ల ధ్వంసం : మాధవరం పోలీస్‌స్టేషన్‌లో ఆరు కేసుల్లో 30 లీటర్ల నాటుసారా, మరో ఆరు కేసుల్లో కర్ణాటక 812 టెట్రా ప్యాకెట్లను ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య మంత్రాలయం సీఐ ఎరిషావలి ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. సోమవారం రాయచూరు రోడ్డులో చెక్‌పోస్టు సమీపంలో 12 కేసుల్లో పట్టుబడిన 812 టెట్రా ప్యాకెట్లు, 30 లీటర్ల నాటుసారాను ట్రాక్టర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు దాదాపు వీటి విలువ రూ.41,560 ఉందని డీఎస్పీ తెలిపారు.

డబ్బుతో ఎమ్మిగనూరు ప్రజలను కొనలేరు : బీవీ

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 8: ఎన్నికల్లో గెలిచేందుకు డబ్బుసంచులతో వాలిపోయారని, అయితే ఎమ్మిగనూరు ప్రజలను డబ్బుతో కొనలేరని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మిగనూరు పట్టణంలోని 12, 9వ వార్డుల్లోని వైసీపీ, జనసేన పార్టీల నాయకులు, సోగనూరుకు చెందిన వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో యువత 12వ వార్డు టీడీపీ అధ్యక్షుడు అల్తాఫ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వీరిని బీవీ జయనాగేశ్వరరెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీవీ మాట్లాడుతూ చేనేతల పేరుతో సీటు తెచ్చుకోవడంపై ఉన్న శ్రద్ధ సంక్షేమ పథకాలు అందించడంలో లేదని విమర్శించారు. అన్నపూర్ణగా ప్రఖ్యాతిగాంచిన ఆంధ్రప్రదేశ్‌ను సీఎం జగన్ గంజాయిప్రదేశ్‌గా మార్చేశారన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని ఇందులో ఎలాంటి సందేహంలేదని స్పష్టం చేశారు. అనంతరం పట్టణంలోని 26వ వార్డులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. టీడీపీలో చేరిన వారిలో ఆలూరు భీమన్న, చిన్న రంగన్న, చాంద్, ఆదిశేషు, నడిపోడు, రమేష్, పెద్ద రంగన్న, హులెప్ప, బతకన్న, రామాంజిని, ఉసేనప్ప నాయుడు, శ్రీనివాసనాయుడు, రియాజ్, రసూల్, పరమేష్, వీరేష్, రాజు, వెంకటేష్, దుర్గా, మహేష్, సుందర్‌రాజు, ఏక్బాల్, రహిమాన్ ఉన్నారు.



బీవీ సమక్షంలో ఎమ్మిగనూరు, సోగనూరుకు చెందిన వైసీపీ నాయకులు

ఇఫ్తార్ విందులో కేఈ శ్యాంబాబు, నాగరాజు



పత్తికొండలో ఇఫ్తార్‌విందులో వడ్డిస్తున్న కేఈ శ్యాంబాబు, నాగరాజు

పత్తికొండ, ఏప్రిల్ 8 : పత్తికొండ షాదీఖానాలో సోమవారం రాత్రి ముస్లిం నాయకులు మీరాహుసేన్, గుండుఫకృద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు, ఎంపీ అభ్యర్థి నాగరాజు పాల్గొన్నారు. మైనార్టీసంఘం నాయకుల ఆహ్వానం మేరకు సాయంత్రం షాదీఖానాకు చేరుకున్న వీరిని నాయకులు శాలువాలతో సత్కరించారు. అనంతరం ఇఫ్తార్‌విందులో పాల్గొన్నారు. వీరితోపాటు టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, సురేష్‌కుమార్, హోటల్‌శ్రీనివాసులు, తిమ్మయ్య చౌదరిలతోపాటు నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

మంత్రాలయంలో టీడీపీ జెండా ఎగరేస్తాం : రాఘవేంద్రరెడ్డి

● టీడీపీలో చేరిన ఉప్పరహాల్ గ్రామస్థులు




అగసనూరులో ప్రచారం నిర్వహిస్తున్న రాఘవేంద్రరెడ్డి, ప్రచారానికి వెళ్తూ బాలుడిని ఎత్తుకొని లాలిస్తున్న దృశ్యం

కోసిగి, ఏప్రిల్ 8: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో మంత్రాలయం నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురడం ఖాయమని టీడీపీ అభ్యర్థి ఎన్.రాఘవేంద్రరెడ్డి అన్నారు. సోమవారం కోసిగి మండల పరిదిలోని అగసనూరులో ఇంటింటికి తెలుగుదేశం ప్రచారంలో భాగంగా విస్తృత ప్రచారం నిర్వహించారు టీడీపీ ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా నాయకులకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, రామిరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, జ్ఞానేష్, రామక్రిష్ణ, చింతలగేని నర్సారెడ్డి, ఈరేష్, నర్సన్న, రాముడు, చిదానంద, మాదేవ, బసప్ప, తాయన్న, బుజ్జి, మల్లారెడ్డి, రామాంజనేయులు, సొట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీ నుంచి టీడీపీలోకి చేరిక

కౌతాళం : టీడీపీ ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలు, అధికార పార్టీ చేస్తున్న అసమర్థ పాలన చూడలేక వైఎస్సాఆర్‌సీపీ నాయకుల కుటుంబాలు సోమవారం టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి సమక్షంలో టీడీపీలోకి చేరారు. వైసీపీలో తమకు తగిన ప్రాధాన్యం లేకపోవడంతో ఉప్పరహాల్ గ్రామానికి చెందిన 50 కుటుంబాలు టీడీపీ అధ్యక్షుడు ఉలిగయ్య ఆధ్వర్యంలో టీడీపీలో చేరినట్లు ప్రకటించారు. వీరిని రాఘవేంద్రరెడ్డి పార్టీ కండువాలు వేసి స్వాగతించారు. కార్యక్రమంలో నాయకులు సురేష్ నాయుడు రామలింగ, గోవిందులు ఉన్నారు.

ఆదోని నాయకులతో బీజేపీ రాష్ట్ర నేతల భేటీ

ఆదోని టౌన్, ఏప్రిల్ 8: బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్‌జీతో పాటు రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు చంద్రమౌళి, జిల్లా ఇన్‌చార్జి అంకాళ్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠతో కలిసి సోమవారం ఆదోని పట్టణంలోని బీజేపీ అసంతృప్తి నాయకులతో భేటీ అయ్యారు. పార్టీ టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్, బీజేపీ రాష్ట్ర నాయకుడు విట్టా రమేష్, జనసేన నాయకుడు మల్లప్పతో కలిసి చర్చలు జరిపారు. అనంతరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు ఇతర నాయకులతో సమావేశమై ఎన్నికల వ్యూహంపై చర్చించినట్లు తెలిసింది. టీడీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు కూటమి అభ్యర్థి విజయం కోసం పని చేస్తామని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, బీజేపీ రాష్ట్ర నాయకులకు తెలిపారు.

పశుగ్రాసం దగ్ధం

మద్దికెర, ఏప్రిల్ 8: పశువుల కోసం ఖాళీ స్థలంలో రైతులు నిల్వగా ఉంచుకున్న పశుగ్రాసం మంటలకు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రైతుకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. సోమవారం మదనంతపురం గ్రామంలో లక్ష్మిస్వామి రైతుకు చెందిన గడ్డివాముకు మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో నిప్పంటుకొని మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలు ఆర్పేందుకు యత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. పత్తికొండ నుంచి ఫైరింజన్లు వచ్చి మంటలు ఆర్పారు. అయితే.. ఏడాది సరిపడా నిల్వగా ఉన్న గడ్డివాము దగ్ధమైందని, రైతును ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాసులు, సంజప్ప కోరారు.

సెలవుపై రాతన సర్పంచు రాచప్ప

తుగ్గలి, ఏప్రిల్ 8: అనారోగ్యం కారణంగా ఆరు నెలలు సెలవు కావాలని సోమవారం రాతన సర్పంచు రాచప్ప ఎంపీడీవో విజయలక్ష్మికి వినతి పత్రం అందించారు. అలాగే డీఎల్‌పీవోకు కూడా ఒక వినతి పత్రం పంపించారు. గత సర్పంచు ఎన్నికల్లో ఒప్పందం ప్రకారం మూడేళ్లు ఒకరికి, రెండేళ్లు మరొకరికి ఉండటంతో ఇలా సెలవుపై వెళ్లారని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. సర్పంచు సెలవుపై వెళ్లడంతో ఉప సర్పంచు అన్వర్‌బాషాకు ఇన్‌చార్జి సర్పంచుగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 8: ఎన్నికల కోడ్ పేరుతో కొంతమంది చిరు ఉద్యోగులకు, కార్మికులకు మార్చినెల వేతనాలు పెండింగ్‌లో పెట్టడం సరైందికాదని వాటిని వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాముడు, గోవిందులు అధికారులను కోరారు. సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ ప్రతినెల 1వ తేదీన వేతనాలు ఇస్తామని జగనన్న ప్రభుత్వం ప్రకటనలు చేసినప్పటికి విచారణలో మాత్రం నేటికి వేతనాలు అందకపోవడం దారుణమన్నారు. ఒకవైపు ఉగాది, రంజాన్, శ్రీరామనవమి పండుగలు వరుసగా ఉన్నప్పటికి ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహిస్తూ చిరు ఉద్యోగుల అవస్థలు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఎన్నికల కోడ్ ఉంటే అన్ని వర్గాల ఉద్యోగులు, కార్మికులకు వేతనాలు నిలిచిపోవాలేగాని కొంతమందికి ఇచ్చి మరికొంతమందికి పెండింగ్‌లో పెట్టడం ఎంతవరకు సమంజసం అన్నారు. తక్షణమే మార్చినెల వేతనాలు, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు రాజు, తిమ్మప్ప, ఇస్మాయిల్, రామన్న, ఖాజా లు పాల్గొన్నారు.

క్రీడాకారులకు కెనరా బ్యాంకు క్రీడా సామగ్రి అందజేత

కౌతాళం, మార్చి 8: మండల పరిధిలోని బాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సోమవారం కెనరా బ్యాంకు అధికారులు క్రీడాసామగ్రిని అందజేశారు. బ్యాంకు మేనేజర్ మల్లికార్జున మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాఆణిముత్యాలను వెలికి తీసేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. బ్యాంకు ఆదేశాల మేరకు సీఎస్ఆర్ కార్యక్రమం కింద గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈఏడాది బాపురం ఉన్నత పాఠశాలను ఎంపిక చేసి పాఠశాలకు దాదాపు రూ.30వేలు విలువ చేసే క్రీడాసామగ్రిని అందించామని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులు కూడా బ్యాంకు సేవలను తెలుసుకుని తమ తల్లిదండ్రులకు గ్రామస్థులకు బ్యాంకులు అందిస్తున్న సేవలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కౌతాళం కెనరా బ్యాంకు అధికారులు రాజశేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు వీరశ్రీ, వీరేష్, ఉప్పలప్ప, గ్రామస్థులు శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు.

ఇదీ పెద్దనేలటూరు - బురాన్‌దొడ్డి రహదారి

గోనెగండ్ల, ఏప్రిల్ 8: ఈ ఫొటోలో కనిపిస్తున్న పెద్దనేలటూరు, బురాన్‌దొడ్డి గ్రామాల మధ్య రహదారి. ఇలా ముళ్లపొదలతో నిండి గుంతలమయమై అడవిని తలపిస్తోంది. ఏళ్ల తరబడి ఈ రహదారిని మరమ్మతులు చేయాలని అధికారులను, పాలకులను వేడుకుంటున్నా స్పందన లేదని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. త్వరలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో పోటీ చేసే నాయకులైనా రహదారి మరమ్మతులు చేయించాలని పెద్దనేలటూరు గ్రామస్థులు వేడుకుంటున్నారు. ఏడాదిగా వైసీపీ నాయకులు రోడ్డుకు నిధులు మంజూరయ్యాయని, పనులు నేడు రేపు అంటూ మాయమాటలు చెప్పి కాలం వెళ్లదీశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ రెండు గ్రామాల మధ్య నాలుగు కిలోమీటర్ల దూరం ఉంది. ఇదే రహదారి వెంట ఇరు గ్రామాల రైతులు పొలాలకు వెళ్లాలి. వర్షాకాలంలో నడిచేందుకు కూడా వీలు కాదని, మిగతా సమయంలో ముళ్ల కంపతో రాక పోకలకు ఇబ్బందిగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ముళ్ల కంప చెట్ల మధ్యలో రహదారి

రజిత రథంపై విహరించిన ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఏప్రిల్ 8 : మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాద రాయలు రజిత రథంపై విహరించారు. సోమవారం ఉగాది అమావాస్యను పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రజిత రథాన్ని వివిధ పుష్పాలతో చూడ ముచ్చటగా అలంకరించి, వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల మధ్య ప్రహ్లాదరాయలను ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.



రజిత రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మహిళ పై దాడి

నందవరం, ఏప్రిల్ 8: గ్రామానికి చెందిన జంబు విశ్వనాథ్, నాగరాజు, ఈరన్న గౌడ్, మహదేవి దాడి చేసి గాయపరిచారని కవిత, ఆమె భర్త బసవరాజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. కవిత, బసవరాజు తమ పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా పాత కక్షలు మనసులో పెట్టుకొని ఇద్దరి పై దాడి చేశారని తెలిపారు. దాడి జరిన వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశామని, తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 8: మండల పరిధిలోని మదర్ థెరిస్సా బీఈడీ కళాశాల సమీపంలో చాకలి రంగన్న(60)అనే వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. సోమవారం మదర్ థెరిస్సా బీఈడీ కళాశాల సమీపంలో ఉన్న ఇటుకల బట్టీల్లో పనిచేస్తున్న కూలీలు బహిర్భూమికి వెళ్లగా అక్కడ వృద్ధుడి మృతదేహం కనిపించింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూరల్ పోలీసులకు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి మృతుడు చాకలి రంగన్నగా గుర్తించారు. బిలాల్ మసీదు ప్రాంతంలో నివసిస్తున్నట్లు తెలుసుకొని బంధువులకు సమాచారం ఇచ్చారు.

బైలుప్పలలో తాగునీటి కటకట

గోనెగండ్ల, ఏప్రిల్ 8: బైలుప్పల గ్రామంలో తాగునీటి ఇక్కట్లు తీవ్రమయ్యాయి. గ్రామానికి హంద్రీ నదిలో వేసిన బోర్ల ద్వారా నీటిని అందించే వారు. ప్రస్తుతం ఎండలు మండిపోతుండటం భూగర్భ జలాలు అడుగంటి తాగునీటి బోర్లుకు నీరు అందడం లేదు. ఈ కారణంగా గ్రామంలోని పలు వీధులకు తాగునీరు సరఫరా కావడంలేదు. ప్రస్తుతం ఎన్నికల సమయం కావడంతో కొత్త బోర్లు కూడా వేసే అవకాశం లేదని తెలుస్తోంది. ఉగాది, రంజాన్ పండుగలు రావడంతో గ్రామానికి బంధువులు, బతుకుతెరువుకోసం వెళ్లిన వారు రావడంతో నీటి సమస్య తీవ్రమైంది. గ్రామస్థులు గ్రామ శివారు పొలాల దగ్గర ఉన్న బావులు, బోర్లను ఆశ్రయిస్తున్నారు. ఎమ్మిగనూరుకు చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ ట్యాంకర్ల తో నీటిని గ్రామానికి సరఫరా చేస్తోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న జనం